# చిన్నవదిన

బలభద్రపాత్రుని రమణి



"ఏదహారో తేదీన పెద్దన్నయ్యా, వదినా వస్తున్నారట!'' ఆఫీసు నుండి వచ్చిన నాకు అమ్మ సంబరంగా ఎదురొచ్చి చెప్పింది.

''ఔనా? మొదట ఇక్కడికే వస్తారా?'' పూల మొక్కల మధ్యనున్న పంపు తిప్పి కాళ్ళు కడుక్కుంటూ అడిగాను.

"ఆ! ఇక్కడికే వచ్చి ఆ తర్వాత చెన్నై వెళ్తారుట. ఎంతైనా సరోజకి మర్యాదా, మన్ననా ఎక్కువ. అన్ని సంవత్సరాలుగా అమెరికాలో వుంటున్నా ఇసుమంతైనా మారలేదు. పిల్లలకి కూడా అవే మర్యాదలొచ్చాయి'' పెద్ద కోడల్ని తలుచుకుంటూ అభిమానంగా అంది అమ్మ. పుట్టింటికి కాకుండా మొదట అత్తింటికే రావడం అమ్మకి గొప్పగా వుంది. గదిలో నుండి చిన్న వదిన దగ్గు వినపడింది.

''వదినా - '' అంటూ ఆమె గదిలోకి వెళ్ళాను.

చిన్న వదిన పేరు సుశీల. ఆమె పెళ్ళైన కొత్తల్లో ఎలా వుండేదో ఇప్పటికీ కళ్ళకి కట్టినట్టు వుంటుంది. గట్టిగా బిగించి వేసిన జడలో ముద్దబంతి పువ్వు

పెట్టుకుని, కాళ్ళకు కడియాలతో మెడ దగ్గరగా వున్న నల్లపూసల గొలుసుతో, కొద్దిగా పైకి మడమలు కనిపించేటట్టుగా చీరకట్టుకుని బండి దిగి ఇంట్లోకి వచ్చింది.

''ఒట్టి పల్లెటూరి పిల్ల. చాలా అమాయకురాల్లా కనిపిస్తోంది!'' అంది పెద్ద వదిన.

పెద్దన్నయ్య అప్పటికే జంషెడ్‌పూర్‌లో ఇంజనీర్‌గా పని చేస్తున్నాడు. పెద్ద వదిన సరోజ ఎప్పుడూ పిల్లలతో హిందీనే మాట్లాడేది. మెడకి ఆనకుండా జుట్టుని కొప్పుచుట్టి అందులో పూసలు, మువ్వలు కనిపించేటట్టు వేళ్ళాడదీసేది. గోళ్ళకీ, పెదవులకీ రంగు వెయ్యడం చీర అడుగున అంచులు పాడయిపోకుండా ఫాల్ కుట్టడం ఆమె దగ్గరే మొదటగా చూశాం మేము. ఆవిడ పుట్టిందీ, పెరిగిందీ మద్రాసులోనే. ఎక్కువగా అరవ పద్ధతులే పాటించేది. మా అక్కయ్యలని ఆడబిడ్డలుగా కాకుండా 'అక్కా' అనడం, మా అమ్మని అత్తయ్యా అని కాకుండా 'అమ్మా' అనడం చేసేది.

ఊరినుండి రాగానే, మళ్ళీ వెళ్ళేటప్పుడూ అమ్మ కాళ్ళకి నమస్కారం చేసేది. కొంగు నెత్తిమీద నుండి కప్పుకుని నాన్నగారి ఫోటోకు కూడా నమస్కరించేది. చిన్నన్నయ్యనీ, నన్నూ, 'చిన్నీ, మున్నీ' అని ముద్దుగా పిలుస్తుండేది. వాళ్ళకి ఓ ఆడపిల్ల పుట్టినప్పుడే అన్నయ్యకి అమెరికా వెళ్ళే అవకాశం వచ్చింది. అప్పట్లో మా పొలం అమ్మితేకానీ పని జరగలేదు. ఆ తర్వాత ఒక మగ పిల్లవాడు అక్కడే పుట్టాడు. ఆ వెళ్ళిన వాళ్ళు మళ్ళీ ఐదేళ్ళకి చిన్నన్నయ్య పెళ్ళికి వచ్చారు.

చిన్న వదిన సుశీల, సరోజ వదినలా కలుపుగోలుగా వుండేది కాదు. అలవాటులేని హైద్రాబాద్ పద్ధతులని చూసి ముడుచుకుపోతుండేది. హిందీలో ఎవరైనా మాట్లాడితే భయపడిపోయి పరాయి దేశంలో విసిరేయబడినట్టు ఫీలయ్యేది. ఒంటరిగా కూర్చుని గోధుమలు బాగు చేసుకుంటూనో, ఏదో కుట్టుకుంటూనో వుండిపోయేది. సినిమాలంటే ఇష్టపడేది కాదు. అన్నయ్య అంటే భయం భయంగా వుండేది. అమ్మ ఏ పని చేస్తున్నా వెళ్ళి అందుకునేది.

''ఆ తలకి నూనె రాయడం తగ్గించు''

''కాస్త కిందకి కట్టుకో చీర''

''చిన్న బొట్టు పెట్టుకో''

''నలుగురిలో మసలుతూ వుంటే కాస్త మనుషులతో మాట్లాడడం వస్తుంది. అదే సరోజైతేనా?'' అంటూ ఏదో ఒకటి అంటుండేది అమ్మ. వదిన ఏం అనుకుంటుందోనని ఆలోచించేది కాదు!

మా చిన్న వయసులో ఎప్పుడూ అల్లరి చేయడం, ఆడుకోవడం, ఏదైనా కావల్సి వస్తే చిన్నన్నయ్య దగ్గర పేచీ పెట్టి డబ్బులు వసూలు చేసుకోవడం తప్ప ఏం పట్టించుకునే దాన్ని కాదు. కానీ నాకు వయసు వచ్చే కొద్దీ చిన్న వదినతో స్నేహంగా వుండాలనిపించేది.

వంటిల్లు కడుగుతూ, వడియాలు పెడ్తూ, పిల్లలకి బట్టలు కుడ్తూ వదిన ఎప్పుడూ బిజీగా వుండేది.

''వదినా నా లంగా మీద కుట్టినట్టే అద్దాలు నీ చీర మీద కూడా కుట్టుకోవచ్చు కదా!'' అంటే నవ్వేది.

''వదినా కనకాంబరాల మాలంటే నాకే ఎందుకు పెడ్తావు? నువ్వూ పెట్టుకో'' అన్నా జవాబియ్యకుండా నవ్వేసేది.

మా రెండో అక్క పురిటికి చిన్న వదిన గాజులు అమ్మేయాల్సొచ్చింది అన్నయ్యకి. అప్పుడు వాళ్ళ ఫ్యాక్టరీ స్ట్రైక్‌లో వుంది. తమ్ముడికి ఇంజనీరింగ్‌లో సీటు వచ్చినప్పుడు వదిన పేర్న వున్న పొలం అమ్మేశాడు.

''పెద్దాడొస్తే నీ సొమ్ము నీకు ఇప్పించేస్తాను'' అంది అమ్మ.

''నా పిల్లల్ని వాళ్ళ పెద్దనాన్న, బాబాయ్ ఏలోటూ లేకుండా చూసుకుంటార్లెండి అత్తయ్యా!'' అంది నవ్వుతూ వదిన.

''వదినా... ఎప్పుడూ పనిచేస్తూ వుంటావు. నీ జీవితంలో కాస్తయినా మార్పు కావాలనిపించదా?'' ఓసారి నిలదీసినట్టు అడిగేశాను.

''మార్పులేకేం? నేనొచ్చినప్పుడు చిట్టిపొట్టి గౌన్లల్లో ఇంతుండే దానివి.. ఇప్పుడు చూడు పైట లేసుకుని ఎంతగా ఎదిగిపోయావో! ఇంగ్లీషు గడ గడా మాట్లాడ్తూ దొరసానిలా తయారయ్యావు'' అంది.

మా ఎదుగుదలా, అభ్యున్నతీ ఇవే తన జీవితంలో వస్తున్న మార్పులనుకునేది పిచ్చి వదిన! రోజులో తొమ్మిది కిలోల చింతకాయ తొక్కి జాడీకెత్తితే అదే పెద్ద ఎఛీవ్‌మెంట్ అనుకుని అత్తగారి కాంప్లిమెంటుకి మురిసిపోయేది!

''సుశీల ఎందుకో ఈ మధ్య నీరసంగా వుంటోందిరా!'' అంది ఓ రోజున అమ్మ.




తన అనారోగ్యం విషయం కూడా ఏకాంతంలో అన్నయ్యకి చెప్పుకోవడం రాదు వదినకి.

చిన్న అన్నయ్యకి ఇంటి ఖర్చులు లెఖ్ఖ చూసుకోవడం తప్ప పెళ్ళాం మీద పెద్దగా శ్రద్ధ వుండేదికాదు. అన్నీ వేళకి అమరిపోతూ వుంటే ఆమె బాగానే వుందనుకునేవాడు.

అమ్మ చెప్పాక 'సుశీ ... ఒంట్లో ఎలా వుందీ? బాలేదని నాతో చెప్పొచ్చుగా!'' అన్నాడు.

''డాక్టర్ దగ్గరకెళ్తే బోలెడు ఖర్చు ఎందుకులెండి?'' అంది వదిన.

అన్నయ్య బలవంతం చేసి డాక్టర్ దగ్గరకి తీసుకెళ్ళాడు. ఏదో సమస్య వుందని పెద్ద ఆపరేషన్ చేసి గర్భ సంచి తీసేశారు. ఆ తర్వాత ఆయాసం పట్టుకుంది. చలికాలం వస్తే దగ్గూ, ఆయాసం. తెగ హైరానా పడ్తుంది.

నేను డిగ్రీ పూర్తిచేసి చిన్న కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాను. ఎంత ప్రయత్నం చేసినా చిన్న వదినకి పొద్దున్నే పెద్దగా సహాయం చెయ్యలేకపోయే దాన్ని. అమ్మతో వంటచేయించాలని చూసేదాన్ని. కానీ ఆవిడ ఎప్పుడూ బీ.పీ అంటుండేది.

అక్కలిద్దరూ ఆదివారం వస్తే చాలు పిల్లలతో, మొగుళ్ళతో వచ్చేసే వారు. వచ్చిన వాళ్ళని భోజనాలకి వుండమనకపోవడం అమర్యాదని మా వదిన అభిప్రాయం. భోజనం వేళకి రాకపోతే టిఫెన్ చేసి పెట్టేది.

మా తమ్ముడు వేళాపాళా లేకుండా ఫ్రెండ్స్‌ని వెంటేసుకుని వచ్చి ''వదినా కాఫీ'' అనేవాడు.

నేను ఇంట్లో వుంటే వాడిని కోప్పడేదాన్ని. అయినా పెద్దగా పట్టించుకునే వాడు కాదు. వదిన పనిభారం పెరగడమే తప్ప తరగడం కనిపించడం లేదు.

చిన్న వదిన వల్ల అతి శుభ్రం అలవాటైపోయిన అన్నయ్య కొద్దిగా పనిలో తేడా వచ్చినా సర్దుకునేవాడు కాదు. ఊరికే సణిగేవాడు.

నేను ప్రొద్దుటే టిఫెన్ పని చూడడం, బాక్సులు కట్టడం, కాఫీలు అందించడం, సాయంత్రాలు బట్టలు మడత పెట్టడం, ఇస్త్రీ చెయ్యడం లాంటివి చేసేదాన్ని. దానికే అమ్మ ''ప్రొద్దుట్నుండీ ఆఫీసులో చేసి చేసి వచ్చి ఇంట్లో కూడా ఎందుకే?'' అని విలవిలలాడి పోయేది. వదిన చేసేదాంట్లో ఇదెంత? అనిపించేది కాదావిడకి. కారణం వదిన నోరులేనితనం.

చలికాలం మూలాన వదినకి దగ్గూ, ఆయాసం ముమ్మరంగా వుంది.

''వదినా! కాఫీ త్రాగవా?'' అంటూ గదిలోకి వెళ్ళాను.

వదిన సాయంత్రం వంటకి కూరలు తరుగుతోంది.

''ఏం లేదు. మధ్యాహ్నం బావగారూ వాళ్ళూ

వస్తున్నారని తెలిసి కొనిని జంతికలూ, చేగోడీలూ చేశాను. నూనె పొగ పడలేదు!'' అంది దగ్గు తెరలమధ్యన.

''చెయ్యకపోతే ఏంపోయె? కొని తెచ్చేదాన్ని కదా!'' బాధగా అన్నాను.

ఆమె వినదనీ, పని చెయ్యడం ఆమెకి అలవాటయి పోయిందనీ నాకు తెలుసు!

పెద్ద అన్నయ్య వాళ్ళు వచ్చే సమయానికి ఊళ్ళో ఉన్న అక్కలిద్దరూ కూడా వచ్చేశారు.

అమ్మ సంబరానికి అంతేలేదు. ఆరేళ్ళ తర్వాత చూస్తోందావిడ కొడుకునీ, కోడల్నీ, మనవలనీ!

మా తమ్ముడు టాక్సీ తీసుకుని స్టేషన్‌కి వెళ్ళాడు.

చిన్నన్నయ్య ఇంటికి సున్నాలు వేయించి గదిలోకి కొత్త మంచం, హాల్లోకి కొత్త సోఫాసెట్టూ కొన్నాడు. అందరం వాళ్ళకోసం ఆనందంగా ఎదురు చూస్తున్నాం.

ఇంటి ముందు టాక్సీ ఆగింది.

పెద్ద అన్నయ్య దిగగానే అమ్మ ఎదురెళ్ళి కౌగలించుకుని ఏడ్చేసింది. అన్నయ్య ఆవిడ్ని దగ్గరకి తీసుకుని, మా అందర్నీ పేరు పేరునా పలకరించాడు.

పెద్ద వదిన అమ్మ కాళ్ళకి నమస్కరించి, షోకేసుల్లో బొమ్మల్లా వున్న పిల్లలచేత కూడా పెట్టించింది.

అమ్మ పొంగిపోయింది. చిన్న వదిన చేత దిష్టి తీయించింది.

చిన్న వదినని చూసి ''సుశీలా ... నువ్వేం మారలేదు'' అంది పెద్ద వదిన.

సన్నగా తాటాకు బద్దలా తయ్యారై వేలిముడితో, ముతక చీరలో చిన్న వదిన అతి ఆడంబరంగా వున్న పెద్ద వదిన ముందు వెలవెలబోయింది.

భోజనంలోకి బొబ్బట్లూ, పులిహోరా, చక్రపొంగలీ, రెండు కూరలూ, పప్పూ, సాంబారూ, అప్పడాలూ, గడ్డ పెరుగూ వేసి కొసరి కొసరి వడ్డించింది చిన్న వదిన.

పిల్లలు ఇక్కడ నీళ్ళు తాగకూడదుట. కారం అలవాటు లేదుట. అన్నీ నాకి చూసి వదిలేశారు. అన్నయ్య కూడా తినడానికి భయపడ్డాడు. పెద్ద వదినైతే ప్రతి పదార్థం తిని 'కారం... కారం' అని నీళ్ళు తాగింది.

''ఇంకా ఇంత ప్రిమెటీవ్‌గా గొడ్డుకారాలు తింటున్నారా అమ్మా... అందుకే నీకు బీ.పీ కంట్రోల్ అవడం లేదు'' అన్నాడు పెద్దన్నయ్య.

మధ్యాహ్నం అన్నయ్య వాళ్ళు అమెరికా నుండి తెచ్చిన బహుమతులు అందరికీ పంచారు. అక్కలకీ, బామ్మకీ, పిల్లలకీ బట్టలూ, కార్డ్‌లెస్ ఫోన్లూ, కెమేరాలూ తెచ్చారు. తమ్ముడికి వాక్‌మెన్, నాకు డ్రెస్సులూ, రకరకాల పూసలూ, అమ్మకి స్లీపింగ్ బ్యాగ్. చిన్నన్నయ్యకి ఎలక్ట్రిక్ రేజర్, రిస్ట్‌వాచ్, పిల్లలకి బొమ్మలూ, చిన్న వదినకి హేండ్ మిక్సర్, పెర్క్యులేటర్.

అందరూ ఆ గిఫ్ట్స్ తీసుకుని పెద్ద వదిన సెలెక్షన్‌నీ, తెలివినీ తెగ మెచ్చుకున్నారు.

అందరూ అన్నీ తమ తమ ఆనందానికి వాడుకుంటారు. కానీ చిన్న వదినకి ఇచ్చినవో? ఆమె స్వంతానికి కాదు. మా సౌలభ్యానికి వాడేవి. కానీ చిన్న వదినే అందరికన్నా ఎక్కువగా సంతోషించింది.

''అక్కా... ఒక్క పచ్చి మిరప కాయ కూడా ఇందులో నూరేయచ్చు! ఎంత బాగుందో చిన్నగా చేతిలో పట్టేట్టుగా వుంది'' అంది.


పది కిలోల మిరపకాయలు దంచే వదిన ఒక్క మిరపకాయ నూరగలిగే మిషిన్‌ను చూసి ఆనందిస్తుంటే నాకు నవ్వొచ్చింది!

ఆ రాత్రి అమ్మ అన్నయ్యతో ఆర్థిక విషయాల గురించి మాట్లాడింది.

''అక్కడ గొడ్డులా కష్టపడి కూడబెట్టింది అంతా ఇక్కడికి ఒక్కసారి వచ్చి వెళ్తే ఖర్చు అయిపోతుంది అమ్మా! దీప్తికి పెళ్ళి చెయ్యాలీ, గోపీని మెడిసిన్‌లో చేర్పించాలా... నీకు నా పరిస్థితి తెలియనిది కాదు!'' అన్నాడు.

పెద్ద వదినైతే చిన్న వదినకి తమ కష్టాలు కథలు కథలుగా వర్ణించి చెప్పింది.

''రోజా న్యూస్‌పేపర్లో వివిధ రకాల సేల్స్ అడ్వర్‌టైజ్‌మెంట్స్ చూడడం, వీక్ ఎండ్స్‌లో అక్కడికి వెళ్ళి ధరల పట్టిక చూస్తూ వస్తువులు కొనుగోలు చెయ్యడం చేస్తాం. అంత పొదుపుగా వుంటేనే ఏదోలాగా బ్రతకగలం. మాకు కావలసినవన్నీ చకచకా కొనేసుకోవడం, దర్జాగా బ్రతకడం చేస్తే ఒక్క డాలర్ కూడా మిగల్చలేం! ఎక్కడ ఏ వస్తువు చౌకగా లభిస్తే అక్కడికి వెళ్ళి కొనుక్కోవాలి. డబ్బులు పారేస్తే మీకులా పని మనుషులు దొరకరు. డాక్టర్ అవసరం సాధారణంగా రానీయకూడదు. చాలా ఎక్స్‌పెన్సివ్. మనకులా చిన్నచిన్న మందులు మనంతట మనం కొని వేసుకోకూడదు. తిండికీ, కావలసిన వాళ్ళకీ అన్నింటికీ మొహం వాచిపోతాం. కానీ పిల్లలు అక్కడ అలవాటు పడ్డారు కాబట్టి ఇండియా రావడానికి ఇష్టపడడం లేదు'' అని కళ్ళనీళ్ళు పెట్టుకుంది.




చిన్న వదిన కరిగిపోయి ''బెంగపడకండి అక్కయ్యా, దీప్తి పెళ్ళికి కావాలంటే ఇల్లు అమ్మేద్దాం. మా పిల్లలకి ఇప్పుడే పెళ్ళిళ్ళకి తొందరలేదు కదా!'' అంది.

ఉన్న రెండు రోజులూ పెద్ద వదిన అమ్మ ఆరోగ్యం గురించి తెగ ఆదుర్దా ప్రకటించింది. ఆడ బిడ్డలతో పరాచికాలూ, పిల్లల్ని తెగ ముద్దు చెయ్యడాలు చేస్తూ అన్నీ తనే అయి, అందరినీ పలకరిస్తూ గలగలమని నవ్వుతూ తిరిగింది. చూడడానికి వచ్చిన ఇరుగుపొరుగులు అమ్మ అదృష్టానికి ఈర్ష్య పడ్డారు.

''శారదమ్మ పెద్ద కోడలికి ఇసుమంతైనా గర్వం లేదమ్మా. ఎంతైనా శారదమ్మ పెట్టి పుట్టింది!'' అన్నారు.

అమ్మ ఆనందానికి అవధులు లేవు.

మరునాడే పిల్లలు వాళ్ళమ్మతో ఇంగ్లీషులో ఇక్కడ వుండలేం, పిన్ని దగ్గ చాలా ఇబ్బంది పెడ్తోంది అని గునిశారు.

వెంటనే పెద్దన్నయ్య చెన్నైకి టిక్కెట్లు తెచ్చేశాడు.

చిన్నన్నయ్యా, చిన్నవదినా, అమ్మా ఇంకో నాలుగు రోజులు వుండి వెళ్ళమని ఎంత బ్రతిమాలినా వాళ్ళు వినలేదు.

మళ్ళీ నా పెళ్ళికి వస్తామని చెప్పి అందరికీ 'టాటా'లు చెప్పి వెళ్ళిపోయారు.

వాళ్ళు వెళ్ళిపోయాక కూడా అందరూ వాళ్ళ గొప్పలే చెప్పుకుని మురిసిపోతున్నారు.

''సరోజ వదిన మనసు అమృతం!''

''పెద్ద వదిన మాటల్లో ప్రేమ పొంగిపొర్లుతుంటుంది''

''ఆమెది పెద్ద మనసు! నా.. పరా భేదం లేదు'' అంటూ అక్కలూ, అమ్మా ఒకటే పొగడ్తలు.

నాకు మాత్రం ఎప్పుడో ఒకసారి వచ్చి నాలుగు రోజులు ప్రేమని గుప్పించిపోయే పెద్ద వదిన, మీ కోసం అనునిత్యం పాటుపడే చిన్న వదిన ముందు, సుగంధాలు విరజిమ్మే సంపెంగ పువ్వు ముందు పెట్టిన రంగురంగుల ప్లాస్టిక్ పువ్వులా తోస్తుంది.

ఆవిడ తెచ్చిన ఖరీదైన 'ఔట్స్' కన్నా మా చిన్న వదిన ప్రేమగా అల్లి పెట్టే సన్నజాజుల మాలే మిన్న!

కానీ మా అమ్మతోబాటు మిగిలిన వాళ్ళందరూ కూడా వాళ్ళని గొప్పగా, శాపవశాత్తూ దివి నుండి దిగి వచ్చిన దేవతలా చూస్తారు. అంతా డాలర్ మహిమ! అమెరికా చుట్టాలంటే మాటలా మరీ!